క్లుప్తంగా

ఘనంగా హిందీ దివస్



చానమిల్లి హైస్కూల్లో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న హెచ్‌ఎం

గణపవరం: శనివారం హిందీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజిలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ పి.నిర్మల కుమారి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మాతృభాషతోపాటు హిందీ నేర్చుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హిందీ ప్రాధాన్యతపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.

లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం



భీమడోలు లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న ఇన్‌చార్జి మెజిస్ట్రేట్

భీమడోలు: సత్వర న్యాయం లోక్ అదాలత్ వల్ల సాధ్యమని భీమడోలు ఫస్ట్ క్లాస్ ఇన్‌చార్జి మేజిస్ట్రేట్ బండి రచన అన్నారు. భీమడోలు కోర్టులో శనివారం జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని వివిధ కేసుల పరిష్కారం చేశారు. భీమడోలు, ద్వారకాతిరుమల, దెందులూరు మండలాల పరిధిలో 25 కేసులను ఇరు వర్గాల రాజీ మార్గంలో పరిష్కరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.గంగాధర్, పోలీస్ శాఖ సంయుక్త సహకారంతో రాజీ పడదగిన సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరించారు. మేజిస్ట్రేట్ బండి రచన మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులకు సత్వర న్యాయం అందుతుందన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాలి నాగేశ్వరరావు, కోశాధికారి ఇంజేటి విజయ్ అచ్యుతం, ప్రతినిదులు శిరిగినీడి గోపి, ప్రత్తిపాటి బాలాజీ, సిబ్బంది పాల్గొన్నారు.

కాశిపాడు సర్పంచ్‌గా నాగరాజు ప్రమాణస్వీకారం

గణపవరం: కాశిపాడు సర్పంచ్‌గా ఉపసర్పంచ్ తెర్లినాగరాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత సర్పంచ్ కోట నాగేశ్వరరావు ఆరోగ్య కారణాలతో సెలవు పెట్టడంతో ఉపసర్పంచ్ తెర్లి నాగరాజును ఇన్‌ఛార్జి సర్పంచ్‌గా నియమిస్తూ ఎంపీడీవో ఉత్తర్వులు ఇచ్చారు. దీనితో శనివారం పంచాయతీ కార్యాలయంలో నాగరాజుతో కార్యదర్శి రామరాజు పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. నాగరాజును మండల బీజేపీ కన్వీనర్ కొయ్యా వెంకట సుబ్బారావు, పంచాయతీ సభ్యులు పుష్పగుచ్చాలు, పూలమాలలు వేసి అభినందించారు.

పాఠశాల బోర్డుపై విద్యార్థుల హాజరు వివరాల నమోదు

దెందులూరు: మండలంలో అన్ని పాఠశాలల్లో ఇకపై బోర్డుపై హాజరైన విద్యార్థులు, మొత్తం విద్యార్థుల సంఖ్య విధిగా నమోదు చేయాలని దెందులూరు మండల విద్యాశాఖాధికారి ఏవీఎస్‌వీ ప్రసాద్ అన్నారు. పాఠశాల విద్యాశాఖ రాష్ట్ర డైరెక్టర్ పార్వతి దీనిపై లిఖితపూర్వక ఆదేశాలు జారీ చేశారన్నారు. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ ఆదేశాలను పాటించాలని అన్నారు. విద్యాశాఖ ఆదేశాలను పాఠశాలలకు తెలియజేమన్నారు.

17 నుంచి స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాలు

దెందులూరు: మండలంలో ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు కలెక్టర్ ఆదేశాల మేరకు స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు దెందులూరు ఎంపీడీఓ వీ.శ్రీలత తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ స్వచ్ఛ గ్రామాల సాకారానికి ప్రజల భాగస్వామ్యం, అవగాహన, సహకారం ఎంతో అవసరమన్నారు. 17న మానవహారం, 20న మొక్కలు నాటే కార్యక్రమం ఉంటుందన్నారు. అన్ని గ్రామాల్లో ఉద్యోగులు ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాలు విజయవంతమయ్యేందుకు కృషి చేయాలని ఎంపీడీఓ సూచించారు.

ఉత్సాహంగా మండలస్థాయి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు

దెందులూరు: ఆటల పోటీలు విద్యార్థుల్లో అంతర్గత ప్రతిభను వెలికితీయడానికి దోహదపడగాయని దెందులూరు మండల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల కోఆర్డినేటర్ జక్కుల సురేష్‌కుమార్ అన్నారు. దెందులూరు గారపాటి హైమావతిదేవి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జునరావు అధ్యక్షతన మండల స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు వచ్చే వారం నిర్వహించనున్న నియోజకవర్గస్థాయి పోటీల్లో పాల్గొంటారని కోఆర్డినేటర్ అన్నారు. పోతునూరు ప్రధానోపాధ్యాయుడు ఎస్‌కే వలీ, ఫిజికల్ డైరెక్టర్లు ఎం.కృష్ణారావు, వి.పార్థసారధి, జీ.శ్రీనివాసరావు, ఎల్.రవిబాబు, ఎస్. రాధ ఉన్నారు.

ఇరుకైన వంతెనలు.. పొంచి ఉన్న ప్రమాదం

- కాలం చెల్లిన వాటిపై బిక్కుబిక్కుమంటూ రాకపోకలు
- ఏ క్షణంలో కూలుతుందోనన్న భయం
- ప్రభుత్వం నిధులు వెచ్చించి పునర్ నిర్మించాలని డిమాండ్



బ్రిటీష్ కాలం నాటి పూళ్ల వంతెన



పాతూరు వద్ద శిథిలావస్థకు చేరిన వంతెన



కురెళ్లగూడెం వద్ద శుక్రవారం వంతెన వైపునకు వెళ్లలేక అదుపుతప్పిన లోడు లారీ (ఫైల్)



అదుపుతప్పిన లారీ

భీమడోలు: గోదావరి కాలువపై ఇరుకైన వంతెనలపై ప్రయాణం వాహనదారులకు ప్రాణసంకటంగా మారింది. ఇప్పటికే శిథిలావస్థకు చేరిన బ్రిటిష్ కాలం నాటి వంతెనలపై అధిక లోడు వాహనాలు రాకపోకలు సాగించడంతో ఏ క్షణంలో అవి కూలిపోతాయోనన్న భయం ఆ గ్రామాల ప్రజలను వెంటాడుతోంది. ఇప్పటికే శిథిలావస్థకు చేరిన ఆ వంతెనలపై సామర్థ్యానికి మించి ఆక్వా చెరువులకు వెళ్లే లారీలు ప్రయాణిస్తూ భయాందోళనలకు గురి చేస్తున్నారు. వంతెనలు కూలితే ప్రజాజీవనానికి తీవ్ర విఘాతం ఏర్పడుతుంది. రైతన్న కష్టం వర్ణనాతీతం. సాధారణంగా వంతెనల పక్కనే బస్టాండ్‌లు వద్ద జనం కూడా ఎక్కువగా ఉంటున్నారు. ఏ నిమిషంలోనైనా ప్రమాదాలు జరిగే అవకాశాలు మెండు. భీమడోలు మండలం పరిధిలో గోదావరి కాలువపై పూళ్ల, కురెళ్లగూడెం, పాతూరు, గుండుగొలను గ్రామాల్లో వంతెనలు ఉండగా వాటిలో గుండుగొలనులో నిర్మాణంలో ఉంది. మిగిలిన పూళ్ల, కురెళ్లగూడెం, పాతూరు వంతెనలు శిథిలావస్థలోనే ఉన్నాయి. పూళ్ల వంతెన నిర్మించి శతాబ్ద కాలంగా ప్రజలకు సేవలందిస్తోంది. ఎంఎంపురం, సాయన్నపాలెం, నిడమర్రుల్లో విస్తరించిన చేపల చెరువులకు భారీ వాహనాల్లో మేత, చేపల లోడ్ లారీలు యథేచ్ఛగా సాగుతున్నాయి. దీనితో కూలుతుందోనన్న భయం గుప్పిట్లో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కురెళ్లగూడెం వద్ద కాలువపై ఉన్న ఇరుకైన వంతెన రహదారికి ఎత్తులో ఉండడంతో ఆ వంతెనపై నుంచి కొల్లేరు గ్రామాలకు వెళ్లే భారీ వాహన రాకపోకలు తరుణంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నారు. ఆక్వా చెరువులకు అధిక బరువు గల విద్యుత్ స్తంభాలను లారీలో తీసుకుని వెళ్తున్న క్రమంలో ఒక్కసారిగా అదుపుతప్పి వెనుక టైర్లు రహదారిపై ఉన్న బస్టాండ్ వైపునకు ఒరిగిపోతున్న సంఘటనలు ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఇరుకుగా ఉన్న వంతెనపై భారీ వాహనాలు ప్రయాణించడమే కష్టంగా ఉండగా భారీ లోడు వేసుకుని వెళ్లడంతో ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. దీనిపై అధిక లోడు లారీలు వెళ్లకుండా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. పాతూరు వద్ద నిర్మించిన వంతెన గోడు కూలిపోయింది. వంతెనపై బిక్కుబిక్కుమంటూ ప్రయాణించాల్సిందే. రాత్రి వేళల్లో మరింత అప్రమత్తంగా ఉండాల్సి వస్తుందని, కనురెప్పపాటు నిర్లక్ష్యం వహిస్తే ప్రమాదం పొంచి ఉంటుందని వారంతా వాపోతున్నారు. ఇకనైనా అధికారులు తగు చర్యలు తీసుకుని వంతెనలు నిర్మించాలని జనం వేడుకుంటున్నారు. ఇరుకైన వంతెనలపై భారీ వాహనాల ప్రయాణాన్ని నిలిపివేయాలని, ప్రభుత్వం నూతన వంతెనల నిర్మాణాలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు



పోతునూరులో బ్లీచింగ్ చల్లుతున్న పంచాయతీ పారిశుధ్య కార్మికులు

దెందులూరు: గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్యం అమలు చేయడానికి పరిసర ప్రాంతాలు కలుషితం కాకుండా ఉండేందుకు ప్రజలందరి భాగస్వామ్యం అవసరమని పోతునూరు సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత బోదుల స్వరూప్ అన్నారు. శనివారం పోతునూరు, కేదవరంలో పారిశుధ్య కార్మికులతో డ్రెయిన్లు, రోడ్ల కిరువైపులా గుంటలపైన బ్లీచింగ్‌ను చల్లించారు. స్వచ్ఛ గ్రామం సాకారానికి ప్రజలందరూ సహకరించాలని పంచాయతీ గ్రామ కార్యదర్శి షరీఫ్ అన్నారు. అనంతరం రెండు గ్రామాల్లో నిర్వహిస్తున్న బ్లీచింగ్ పనులను సర్పంచ్ స్వరూప్, నాయకులతో కలిసి పరిశీలించారు.

నేడు వైద్యుల చలో విజయవాడ

దెందులూరు: రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ వైద్యుల భవిష్యత్తు ప్రయోజనాలు విఘాతం కలిగించేలా ఇచ్చిన జీవో 85ను నిరసిస్తూ ఆ సంఘం చలో విజయవాడకు పిలుపునిచ్చిందని సంఘ నాయకులు తెలిపారు. ఆదివారం సంఘం ఆదేశాలకు అనుగుణంగా వైద్యులు డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయం వద్ద రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ డాక్టర్లు చలో విజయవాడ ర్యాలీగా వెళ్లనున్నట్లు వివరించారు. వైద్యుల ప్రయోజనాలు, భవిష్యత్తును కాపాడటం కోసం చలో విజయవాడ ర్యాలీలో పాల్గొనాలని సంఘ నాయకులు కోరారు.

వైభవంగా శ్రీమన్మహా గణనాథుని ఉత్సవాలు



భీమడోలులో నల్లని వర్ణంలో భక్తులకు దర్శనమిచ్చిన శ్రీమన్మహా గణనాథుడు



కళాకారులకు జ్ఞాపికలను అందించిన ఉత్సవ కమిటీ నిర్వాహకులు



వినాయకస్వామి లడ్డూను దక్కించుకున్న కొమ్మిన రాము



గోపన్నపాలెంలో వినాయకుడిని ఊరేగిస్తున్న బాల గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు

భీమడోలు: జిల్లాలోనే ప్రసిద్ధి గాంచిన భీమడోలులోని శ్రీమన్మహా గణనాథుని ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. 60వ వార్షికోత్సవాల్లో భాగంగా 8వ రోజైన శనివారం స్వామి వారు భక్తులకు నలుపు వర్ణం అవతారంలో దర్శనమిచ్చారు. ఏటా ఇక్కడ సాంప్రదాయబద్ధంగా సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాత్రి ఏలూరు నృత్యాంజలి కళాబృందం గండికోట రాజేష్ ఆధ్వర్యంలో ఆలయ వేదికపై బాలికలచే ప్రదర్శింపబడిన కూచిపూడి, భారతనాట్యం, జానపద నృత్య ప్రదర్శనలు అలరించాయి. చిన్నారులు హావభావాలతో చేసిన నృత్యాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. చిన్నారులను కమిటీ సభ్యులు అభినందించి జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు దత్తాడ శ్రీనివాసరాజు, తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు, గంధం భాస్కరరావు, గంధం వెంకట్రావు, వినాయక ప్రింటర్స్ గోపి పాల్గొన్నారు.

ఉత్సాహంగా వినాయకుని ఊరేగింపు

దెందులూరు: గోపన్నపాలెంలో వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా స్వామివారి ఊరేగింపు వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బాల గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు స్వామి విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఉంచి ప్రత్యేక అలంకరణ చేసి తీన్మార్ వాయిద్యాలు, నృత్యాల నడుమ కోలాహలంగా ఊరేగించి నిమజ్జనం చేశారు. అనంతరం కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

స్వామి వారి లడ్డూకు లాటరీ

దెందులూరు: వినాయక చవితి ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో లాటరీ తీశారు. లాటరీలో కొవ్వలి కోఆపరేటివ్ సొసైటీ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కొమ్మిన రాముకు స్వామివారి లడ్డూ దక్కింది. ఆలయ కమిటీ సభ్యులు శుభాకాంక్షలు తెలియజేసి లడ్డూను కొమ్మిన రాముకు అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులతో కలిసి లడ్డూ ప్రసాదానికి పూజలు నిర్వహించారు.

పుల్లారావుకు ఘన నివాళులు



పుల్లారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు

గణపవరం: సీనియర్ నాయకుడు, బువ్వనపలి మాజీ సర్పంచ్ సంకు పుల్లారావు మరణం తీరని లోటని పలువురు నివాళులర్పించారు. శనివారం బువ్వనపల్లిలో పుల్లారావు అల్లుడు, మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబును పరామర్శించారు. పలువురు ప్రముఖులు పుల్లారావు మరణం పట్ల సంతాపం తెలిపారు. పుల్లారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాలుగు మండలాల నుంచి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు వాసుబాబును పరామర్శించి, పుల్లారావుకునివాళులర్పించారు.

సామాజిక సేవలో భాగస్వాములు కావాలి



డబ్బాలో గుప్పెడు బియ్యం వేస్తున్న ప్రిన్సిపల్, విద్యార్థులు

గణపవరం: విద్యార్థులు విద్యతోపాటు సమాజ సేవలో భాగస్వాములు కావాలని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజి ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అన్నారు. శనివారం డిగ్రీ కాలేజిలో హ్యాండ్‌ఫుల్ ఆఫ్ రైస్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల నుంచి బియ్యం సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కళాశాలకు వచ్చేప్పుడు ఒక గుప్పెడు బియ్యం తెచ్చి ఇక్కడ ఏర్పాటు చేసిన డబ్బాలో వేయాలని సూచించారు. డబ్బా నిండగానే ఆ బియ్యాన్ని పేదలకు, వృద్ధులకు అందజేస్తామని తెలిపారు. అధ్యాపకులు కూడా బియ్యం తెచ్చి డబ్బాలో వేయడం విశేషం. వైస్ ప్రిన్సిపల్ పి.మధురాజు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ సీహెచ్ చైతన్య, ఆంగ్ల శాఖ అధ్యక్షుడు టి.అక్కిరాజు తదితరులు పాల్గొన్నారు

మొటపర్తి రామచంద్రమ్మ స్ఫూర్తి విశ్వవ్యాప్తం కావాలి



కలెక్టర్‌కు ఇంటి పత్రాలను అందిస్తున్న మొటపర్తి రామచంద్రమ్మ, కుమారుడు వెంకట్ (ఫైల్)

దెందులూరు: దెందులూరు, గన్నవరం, ఉయ్యూరులో విద్యా సంస్థల ఏర్పాటుతో పాటు కోట్లాది రూపాయల విలువైన స్థలాలు, భవనాలను ప్రభుత్వానికి దానంగా అందించిన మహోన్నత వ్యక్తి, విద్యాదాత మొటపర్తి రామచంద్రమ్మ స్ఫూర్తి విశ్వవ్యాప్తం కావాలని ఏలూరు మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. రామచంద్రమ్మ కోట్లాది రూపాయలతో విద్యా సంస్థలు, కళాశాలలు ఏర్పాటు చేయడమే కాకుండా సొంత ఇంటిని సైతం చిన్నారులు ఉండే బాలసదనానికి దానం చేసిన ఆమె త్యాగ గుణాన్ని చరిత్ర ఉన్నంతకాలం అందరూ గుర్తుంచుకుంటారని అన్నారు. శనివారం ఫోన్‌లో దాత కుమారుడు మొటపర్తి వెంకట్‌ను పరామర్శించి, సంతాపం తెలియజేశారు. విద్యార్థులు, గ్రామస్తులు దాతల గౌరవాన్ని వారి ఔన్నత్యాన్ని నిరంతరం కాపాడాలన్నారు. తన సమక్షంలోనే అప్పటి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు ప్రభుత్వ బాలసదనానికి రామచంద్రమ్మ తన ఇంటి పత్రాలను అందివ్వడం ఎన్నటికీ మరువలేనన్నారు.

ఎంపీఈవోల సంఘం బలోపేతానికి సమష్టి కృషి



భీమడోలులో నూతన సభ్యత్వాలను అందజేస్తున్న బసవరాజు, రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు

భీమడోలు: వ్యవసాయశాఖ పరిధిలోని బహుళ ప్రయోజన విస్తరణాధికారులకు బదిలీలు చేపట్టాలని ఎంపీఈవోల రాష్ట్ర సంఘం అధ్యక్షుడు బసవరాజు అన్నారు. భీమడోలులో శనివారం ఎంపీఈవోల జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక, సభ్యత్వాల నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రణాళిక కార్యదర్శి జి. ఫణికుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బసవరాజు మాట్లాడుతూ ఏడేళ్లుగా ఎంపీఈవోలకు బదిలీలు చేపట్టలేదని, దీనితో ఎందరో వేరే జిల్లాల్లో దూరాభారంతో విధులను నిర్వహిస్తున్నారన్నారు. దీని వల్ల మహిళలు కిలోమీటర్ల దూరంగా ప్రయాణించి విధులు నిర్వహించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వ్యవసాయశాఖ గ్రామ సహాయకులు లేని ఆర్‌బీకేల్లో ఎంపీఈవోలను నియమించి వివక్షత చూపుతున్నారన్నారు. ఎంపీఈవోలకు బదిలీలు జరిగేలా తన వంతు కృషి చేస్తామని అన్నారు. సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ పాటు పడాలని, సంఘ సభ్యత్వ నమోదులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా నూతన జిల్లా కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా గనపవరపు ఫణికుమార్, జిల్లా కార్యదర్శి పి.అజయ్, జాయింట్ కార్యదర్శులుగా సరేష్, భరత్, జిల్లా మహిళా అధ్యక్షుడిగా ప్రసన్నకుమారి తదితరులను ఎన్నుకున్నారు. వారిని రాష్ట్ర కార్యవర్గం అభినందించింది. కొందరు ఎంపీఈవోలకు నూతన సభ్యత్వాలను అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి పురుషోత్తం రెడ్డి, జాయింట్ కార్యదర్శి రామాంజనేయులు, ఎంపీఈవోలు పాల్గొన్నారు.

నేడు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

దెందులూరు: గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ కళాశాలలో 1993-94 బ్యాచ్ యూజీడీ, బీపీఈడీ కోర్సుల విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించనున్నట్లు పూర్వవిద్యార్థుల యూనియన్ నాయకులు, ఫిజికల్ డైరెక్టర్ ఎం.రాజా అన్నారు. అతిథులుగా ప్రిన్సిపల్ ఎస్.నత్తానియేలు, ఆర్‌ఐపీ మనోహర్ హాజరవుతారని వారు తెలిపారు.

అశోక్ మరణం పార్టీకి తీరని లోటు

దెందులూరు: చింతలపూడి ఏఎంసీ మాజీ చైర్మన్ మేడవరపు అశోక్ శ్రీనివాస్ మరణం పార్టీకి తీరని లోటని ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, పార్టీ మండల అధ్యక్షుడు జానంపేట ప్రసాద్‌బాబు, కామిరెడ్డి నాని, తేరా ఆనంద్, అప్పన్న ప్రసాద్ శనివారం అన్నారు. మెట్ట ప్రాంతంలో పార్టీని బలోపేతం చేసిన మంచి నాయకుడిని కోల్పోయామని ఆయన అన్నారు. శనివారం ఆయన భౌతికకాయాన్ని డీబీఆర్‌కే చౌదరితో పాటు దెందులూరు నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు సందర్శించి నివాళులర్పించారు.

శాంతిభద్రతలకు భంగం కలిగించవద్దు

దెందులూరు: శాంతిభద్రతలకు భంగం కలిగించకుండా ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో, స్నేహపూర్వకంగా జీవించాలని పెదవేగి నూతన సీఐ కే.వెంకటేశ్వరరావు అన్నారు. సీఐగా బాధ్యతలు స్వీకరించి శనివారం ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను కార్యాలయంలో కలిశారు. శాంతిభద్రతలు అమలు చేయడంలో నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని సీఐకు ఎమ్మెల్యే సూచించారు. అనంతరం పలు శాఖల అధికారులు ఎమ్మెల్యేను కలిశారు.

విజయవాడలో వరద బాధితులకు సాయం

ఉంగుటూరు: నారాయణపురానికి చెందిన లవ్ ఇన్ యాక్షన్ సంస్థ సభ్యులు శనివారం విజయవాడలో ప్రజలకు నిత్యావసర సరుకులు, మందులు, కూరగాయలు పంపిణీ చేశారు. పంచారు. సంస్థ ప్రెసిడెంటు ఎస్.పాల్‌దినకరన్, వైస్‌ప్రెసిడెంటు అబ్నేరు, కార్యదర్శి ప్రసాదు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

వరద బాధితుల సహాయనిధికి రూ.5లక్షల విరాళం

పెదపాడు: వట్లూరులోని శ్రీ రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాల మేనేజింగ్ డైరక్టరు కె. సాయి రోహిత్ వరద బాధితుల సహాయార్థం రూ.5లక్షల విరాళాన్ని శనివారం అందించారు.ఈ విరాళానికి చెందిన చెక్కును సీఎం చంద్రబాబు నాయుడును కలిసి అందించినట్లు సాయి రోహిత్ తెలిపారు.

విరాళాల సేకరణ

గణపవరం: వరదలలో నష్టపోయిన ప్రజలను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు విజ్ఞప్తి చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో శనివారం గణపవరంలో వ్యాపార సంస్థలు, ప్రజల నుంచి విరాళాలను స్వీకరించారు. నాయకులు కలిశెట్టి వెంకట్రావు, సీతారాంప్రసాద్, టి.శ్రీనివాస్, పల్లిశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం



నవరాత్రి మహోత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ ప్రతినిధులు

పెదపాడు: వచ్చేనెల 3వ తేదీన సత్రంపాడు ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లోని అంబికాదేవి ఆలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నామని ఆలయ ధర్మకర్త అంబికా ప్రసాద్ తెలిపారు. శనివారం సాయంత్రం అంబికాదేవి ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఉత్సవాలు సెప్టెంబర్ 12వ తేదీ వరకు నిర్వహిస్తామని ప్రతిరోజూ అమ్మవారికి విశేష అలంకరణలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారణాసి రాఘవేంద్రశర్మ మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ సాయంత్రం 6.30 గంటలకు మహిళలతో సామూహిక లక్ష కుంకుమార్చన నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గణేష్ అసోసియేట్ అధినేత ఈ.గణేష్, పలువురు భక్తులు పాల్గొన్నారు.

నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం ఉప్పాకపాడు శివారు ముత్యాలమ్మ తల్లి ఆలయం వద్ద దసరా ఉత్సవాల కోసం పందిరి రాట ముహూర్తం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ఈవో హరే రాంప్రసాదు, అన్నెంనీడి ఏసుబాబు, మాకా శ్రీనివాసరావు, అన్నంనీడి శ్రీనివాసరావు, ముత్యాల కృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.